క్లుప్తంగా

ఉచిత నేత్ర శస్త్రచికిత్సలకు 70 మంది ఎంపిక


రోగులను పరీక్షిస్తున్న నేత్ర వైద్యులు

టెక్కలి: సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం టెక్కలిలోని కంద్రవీధి సమీపంలోని సత్యసాయి మందిరంలో శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో 207 మందికి కంటి పరీక్షలు చేసి అవసరమైనవారికి మందులను అందజేశారు. 70 మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో కన్వీనర్ బి.మల్లేశ్వర్రావు, సీతాపతి, వెంకట్రావు, చంటి, బాబ్జి, శ్రీనివాసరావు, వైకుంఠరావు పాల్గొన్నారు.

సర్పంచ్‌కు మాజీమంత్రి పరామర్శ


పరామర్శలో మాజీమంత్రి అప్పలరాజు తదితరులు

మందస: మందస మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు, బుడార్సింగి సర్పంచ్ సురేష్ పాణిగ్రాహి అనారోగ్యానికి గురయ్యారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ఆదివారం సురేష్ పాణిగ్రాహి ఇంటికి వెళ్లి పరామర్శించి..యోగాక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎంపీపీ డోక్కరి దానయ్య, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి అగ్గున సూర్యారావు, పార్టీ అధికార ప్రతినిధి బమ్మిడి దుర్యోధన, మండల పార్టీ అధ్యక్షులు దల్లి జానికీరావు, సర్పంచ్ చింతాడ గణపతి, పలువురు ఎంపీటీసీ సభ్యులు ఉన్నారు.

అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన


జిల్లా కలెక్టర్‌తో కలిసి కోనేరు గట్టు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

టెక్కలి: టెక్కలి మండలంలో పలు అభివృద్ధి పనులకు మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదివారం శంకుస్థాపన చేశారు. పట్టణంలోని పట్టుమహాదేవి కోనేరు గట్టుపై సుమారు రూ. 13 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు, రావివలస గ్రామంతో పాటు పంచాయతీ పరిధిలోని చిన్ననారాయణపురం, దామోదరపురం తదితర గ్రామాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఆర్డీవో కృష్ణమూర్తితో పాటు నాయకులు కె.హరివరప్రసాద్, బి.శేషగిరి, పి.అజయ్‌కుమార్, ఎం.సుందరమ్మ, ఎం.ధమయంతి పాల్గొన్నారు.

ఘనంగా వినాయక ఆలయ వార్షికోత్సవం


పూజల్లో భక్తజనం

నందిగాం: నందిగాంలోని వరసిద్ధి వినాయక ఆలయ ద్వితీయ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక గణేష్ కాలనీ వాసుల ఆధ్వర్యంలో ఆలయ నిర్మాణకర్త, ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తి దంపతులు కార్యక్రమంలో పాల్గొన్న పురోహితులు రేజేటి బోసుబాబు, మేడేపల్లి రమేష్‌బాబు శాస్త్రోక్తంగా విశేష పూజలు, హోమం నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులు అన్న ప్రసాదాన్ని వితరణ చేశారు. సాయంత్రం స్థానిక భజన బృందంచే భజన కాలక్షేపం నిర్వహించారు.

వైఎస్సార్‌సీపీ నాయకుల పరామర్శ

ఇచ్ఛాపురం రూరల్: లొద్దపుట్టి గ్రామానికి చెందిన సీనియర్ వైఎస్సార్‌సీపీ నాయకుడు సుగ్గు ఛత్రపతి రెడ్డి తమ్ముడు హరిపతి ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు నర్తు నరేంద్రయాదవ్ ఆదివారం సుగ్గు కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలియజేశారు. పార్టీ నాయకులు మురపాల లచ్చయ్య తదితరులు ఉన్నారు.

మిథున సంక్రమణ పూజలు

ఇచ్ఛాపురం: గ్రామ దేవత స్వేచ్ఛావతి అమ్మవారి ఆలయంలో ఆదివారం మిథున సంక్రమణ పూజలు ఘనంగా జరిగాయి. స్వేచ్ఛావతి అమ్మవారికి తైలమర్దన, సిందూర మర్దన, పంచామృతాలతో ప్రత్యేక అభిషేకాలు జరిగాయి. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.

ప్రయాణం భయం..భయం!

- గ్రామీణ ప్రాంతాల్లోని వంతెనలను పట్టించుకోని అధికారులు
- కానరాని జాగ్రత్తలు


గుర్రపుడెక్కలతో బ్రాహ్మణతర్లా వంతెన


కేదారిపురం వంతెనను ఆనుకొని ప్రవాహిస్తున్న వరదనీరు

కాశీబుగ్గ: గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే రోడ్లపై ఉన్న వంతెనలు భయంగొల్పుతున్నాయి. వర్షాకాలంలో వీటిపై ప్రయాణం చేయాలంటే ప్రజలు హడలిపోతున్నారు. సాయంత్రమైతే వీటిపైనుంచి భయం..భయంగా వెళ్లాల్సిందే. ఏమాత్రం అశ్రద్ధంగా ఉన్నా ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంది. పలాస నియోజకవర్గం పరిధిలోని వివిధ గ్రామీణ ప్రాంతాలకు చేరుకోవాలంటే ప్రాణాలు అరచేత పట్టుకుని వంతెనలు దాటాల్సిన పరిస్థితి నెలకుంది. ఆధునికమైన విధానాలు, ఆరులైన్ల రోడ్లు, సరికొత్త వాహనాలతో ప్రయాణాలు కొనసాగుతున్న ఈ రోజుల్లో కూడా పల్లెటూరి ప్రజలు మాత్రం బ్రిటీషు కాలం నాటి వంతెనలే వాడుతున్నారు. దీంతో ఏక్షణంలో ఎలాంటి ప్రమాదం ముంచుకువస్తుందోనని భయాందోళన చెందుతున్నారు.

ఇవీ ప్రమాదకర వంతెనలు..

పలాస మండల కేంద్రం నుంచి బ్రాహ్మణతర్లా వెళ్లే ఆర్అండ్‌బీ రహదారిపై వరహాల గెడ్డ వంతెన ప్రమాదకరంగా మారింది. దశాబ్దాల కిందట నిర్మించిన ఈ వంతెన తక్కువ ఎత్తులో ఉండడంతో వర్షాకాలంలో దీనిపై ప్రయాణం చేయాలంటే ప్రాణాన్ని అరచేతిలో పెట్టుకోవాల్సిందే. వంతెనలకు రక్షణ కవచాలు లేకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఎనిమిదేళ్ల క్రితం వంతెనకు ఇరువైపులా చిన్న స్తంభాలు ఏర్పాటు చేసినప్పటికీ వరద తాకిడికి కొట్టుకుపోయాయి. వంతెనపై నీరు పారితే బ్రాహ్మణతర్లా, పండాశాసనం, పూర్ణభద్ర, అమలకుడియా, నారాయణపురం, నీలిపద్ర, కేసుపురం గ్రామాలకు సంబంధాలు తెగిపోతాయి. వర్షాకాలంలో వంతెన పైనుంచి వరదపారుతుంది. దీంతో ఆ సమయంలో తాళ్లను కట్టి దాని సాయంతో ప్రజలు వంతెనను దాటుతుంటారు. అలాగే కేదారిపురం గ్రామం వద్ద ఉన్న వంతెన కూడా ప్రమాదకరంగానే ఉంది. జిల్లాలో వర్షాలు కురవనప్పటికీ ఒడిశాలోని మహింద్రా గిరులపై కురిసే వర్షాలకు హఠాత్తుగా వరదనీరు వచ్చి వంతెనపై పారుతుంది. దీంతో ఈ ప్రాంతీయులు ఈ వంతెనపై వెళ్లేందుకు భయపడుతుంటారు. ప్రయాణికులు అదమరిచి ఉంటే వరదలో కొట్టుకుపోయే ప్రమాదం ఉంది. రెండేళ్ల క్రితం ఓ యువకుడు ఈ వంతెన వద్ద చనిపోయాడు. సంబంధిత అధికారులు స్పందించి వంతెనలపై రక్షణ కవచాలు ఏర్పాటు చేయాలని, అలాగే నూతన వంతెనల నిర్మాణానికి తగుచర్యలు చేపట్టాలని కేదారిపురం, కంబిరిగాం, నీలిపద్ర తదితర గ్రామస్తులు కోరుతున్నారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ, వజ్రపుకొత్తూరు మండలాల మధ్యలో ఉన్న అంతరకుడ్డ చెరువు వద్ద పరుపుపై కూడా రాకపోకలకు జనం భయపడుతున్నారు.

వంతెనలపై దృష్టిసారించాలి



పలాస నియోజకవర్గంలో రోడ్లు, వంతెనలు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి హయాంలో నిర్మించగా.. అప్పటి ఎమ్మెల్యే జుత్తు జగన్నాయకులు చేతులు మీదుగా ప్రారంభించారు. టీడీపీ హయాంలో ఎక్కడా వంతెన నిర్మాణాలు జరగలేదు. ప్రస్తుతం ఉన్న వంతెనలు ప్రమాదకరంగా ఉన్నాయి. సంబంధిత అధికారులు స్పందించి వంతెనల నిర్మాణంపై దృష్టిసారించాలి.

బగాది కుమార్,
వీరభద్రాపురం, పలాస మండలం

భయంతోనే ప్రయాణం



కూలి పనుల కోసం గ్రామీణ ప్రాంతాలకు చెందిన పలువురు పలాస-కాశీబుగ్గ జంట పట్టణాలకు రోజూ వెళ్తుంటారు. అయితే ప్రమాదకరంగా ఉన్న వంతెనలపై ప్రయాణం చేయడం భయంగా ఉంటుంది. చీకటిపడితే వంతెనలపై వెళ్లేందుకు ఇబ్బందిగా ఉంటుంది. సున్నాడ గ్రామానికి ఇంతవరకు రోడ్డు సదుపాయం కూడా లేదు.

– మామిడి నరసింహమూర్తి,
జగన్నాథపురం, పలాస మండలం

క్రికెట్ టోర్నీ విజేత గురుదాస్‌పురం


విన్నర్ జట్టుకు ట్రోఫీని అందజేస్తున్న సర్పంచ్ చింతాడ గణపతి

మందస: బైరిసారంగిపురం గ్రామంలోని ప్రభుత్వ క్రీడ మైదానంలో 18 రోజులుగా జరుగుతున్న బైరెమ్మ తల్లి క్రికెట్ టోర్నమెంట్ ఆదివారంతో ముగిసింది. ఫైనల్‌లో గురుదాస్‌పురం, బైరిసారంగిపురం జట్లు తలపడ్డాయి. గురుదాస్‌పురం జట్టు నిర్ణీత పది ఓవర్లకు 130 పరుగులు చేయగా.. బైరిసారంగిపురం జట్టు పది ఓవర్లలో 105 పరుగులకే ఆలవుట్ అయింది. దీంతో విజేతగా గురుదాస్‌పురం జట్టు నిలిచింది. ఈ జట్టుకు ట్రోఫీతో పాటు 15 వేల రూపాయలను పితాతోళి గ్రామ సర్పంచ్ చింతాడ గణపతి అందజేయగా రన్నర్‌గా నిలిచిన బైరిసారంగిపురం జట్టుకు గచ్చి దేశయ్య (పండు)పది వేల రూపాయలను అందజేసారు. కార్యక్రమం బైరసారంగిపురం పెద్దలు, యువత ఆధ్వర్యంలో జరిగింది.

అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ


బహుమతి అందుకుంటున్న సతీష్

కవిటి: స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈ నెల 14, 15 తేదీల్లో గుంటూరులోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో జరిగిన సీనియర్ మెన్ అంతర్ జిల్లాల అథ్లెటిక్స్ పోటీలలో కవిటికి చెందిన మొగిలిపురి సతీష్ సత్తాచాటాడు. 20 కిలోమీటర్ల రేస్ వాకింగ్ పోటీల్లో తృతీయ స్థానంలో నిలిచాడు. దీంతో నిర్వాహకులు ప్రశంసాపత్రం, మెడల్‌ను బహూకరించారు.

తల్లిదండ్రులను జాగ్రత్తగా చూసుకోవాలి

- పలాస జూనియర్ సివిల్ జడ్జి మాధురి


మాట్లాడుతున్న జడ్జి మాధురి

కాశీబుగ్గ: పలాస మండల న్యాయ సంఘం, జూనియర్ సివిల్ జడ్జి యు.మాధురి అధ్యక్షతన కోసంగిపురంలోని శ్రీలలితా చారిటబుల్ ట్రస్ట్ భవనం ఆవరణలో వయో వృద్ధులు, మానసిక రోగులతో ప్రత్యేక న్యాయ విజ్ఞాన సదస్సును ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జడి మాధురి మాట్లాడుతూ..వృద్ధులు, తల్లిదండ్రులను ప్రతిఒక్కరూ జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. ఆధార్‌కార్డు లేని వారికి తమ సంస్థ ద్వారా కార్డులను అందజేస్తామన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు బి.కేర్ పట్నాయక్, రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు మన్మథరావు, ఏజీపీ పిండి వెంకట్రావు, అసోసియేషన్ జాయింట్ సెక్రెటరీ జి.ఎం.ఎస్.అనిల్ రాజు, న్యాయవాదులు కె.లోకేష్, కె.దేవరాజ్, ట్రస్ట్ చైర్మన్ సువ్వారి చిన్నిక్రిష్ణ పాల్గొన్నారు.

కిడ్నీ బాధితునికి ఆర్థిక సాయం


పురుషోత్తంకు సాయం అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

కవిటి: మండలంలోని ఆర్.తొత్తిడిపుట్టుగకు చెందిన పాడియా పురుషోత్తం కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న అతనితో కలిసి చదువుకున్న పూర్వవిద్యార్థులు అండగా నిలిచారు. స్పెషల్‌గయ్స్ ఫౌండేషన్ ద్వారా రూ. 27 వేలు సేకరించారు. ఈ మొత్తాన్ని పురుషోత్తంకు ఆదివారం అందజేశారు. వైద్యఖర్చులకు వినియోగించాలని కోరారు.

సోంపేటలో పోలీసుల తనిఖీలు


దుకాణంలో తనిఖీలు చేస్తున్న ఎస్సై లోవరాజు

సోంపేట: సోంపేట పట్టణంలోని పలు దుకాణాల్లో పోలీసులు ఆదివారం తనిఖీలు చేశారు. గంజాయి, డ్రగ్స్, మద్యం అక్రమంగా జరగకుండా డాగ్‌స్క్వాడ్‌తో క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. మత్తు మందులు నిల్వ చేస్తే చర్యలు తప్పవని ఎస్ఐ లోవరాజు అన్నారు. అనంతరం సోంపేట పట్టణంలోని గాంధీమండపం వద్ద వాహనచట్ట నిబంధనలపై అవగాహన స్థానికులకు అవగాహన కల్పించారు. విధిగా నిబంధనలు పాటించాలని వాహనదారులకు ఎస్సై సూచించారు. పోలీసు సిబ్బంది, యువత పాల్గొన్నారు.

కళింగ సంక్షేమ సంఘం మహిళా అధ్యక్షురాలుగా శిరీష


శిరీషను అభినందిస్తున్న ప్రతినిధులు

టెక్కలి: ఏపీ కళింగ సంక్షేమ సంఘం మహిళా అధ్యక్షురాలుగా టెక్కలి మాజీ ఎమ్మెల్యే కొర్ల భారతి కుమార్తె శిరీషను ఎన్నుకున్నారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటనలో వివరాలు వెల్లడించారు. విశాఖలో రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.వి.రమణ, వైస్ ప్రెసిడెంట్ ఎస్.సత్యం, జిల్లా అధ్యక్షుడు ఎ.గోవిందరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా మహిళా అధ్యక్షురాలిగా శిరీషను ఎన్నుకున్నట్లు వెల్లడించారు. కళింగ సంక్షేమ సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని ఆమె పేర్కొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

టెక్కలి: టెక్కలి ఆర్టీసీ డిపో లో సోమవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమా న్ని నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు ఆది వారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఉదయం 11 గంటల నుంచి నిర్వహిస్తున్న ఈ కార్యక్ర మం ద్వా రా ప్రయాణికులు సమస్యలను ఫోన్ ద్వారా విన్నవించవచ్చునని వెల్లడించారు. 99592 25611 నంబర్‌కు ఫోన్ చేసి సమస్యలను తెలియజేయాలని సూచించారు.

అభ్యుదయ కవి శ్రీశ్రీ


టెక్కలి: శ్రీశ్రీ వర్ధంతి కార్యక్రమంలో వివిధ సంఘాల ప్రతినిధులు


కాశీబుగ్గ: శ్రీశ్రీ కవితను వినిపిస్తున్న కృష్ణమూర్తి

టెక్కలి: అభ్యుదయ కవి శ్రీరంగం శ్రీనివాసరావు అని యూటీఎఫ్, ప్రజా నాట్య మండలి, జనవిజ్ఞాన వేదిక సభ్యులు కొనియాడారు. శ్రీశ్రీ వర్ధంతి కార్యక్రమాన్ని ఆదివారం టెక్కలిలో నిర్వహించి ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సమాజాన్ని అభ్యుదయం వైపు తీసుకువెళ్లడంలో శ్రీశ్రీ రచనలు ఎంతగానో దోహదపడ్డాయని గుర్తు చేశారు. నేటితరం కవులకు ఆదర్శనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో పి.ధర్మారావు, కె.దాలయ్య, హెచ్.ఈశ్వరరావు, అరుణ్ కుమార్, వెంకట్రావు, గణపతిరావు, ఎం.తాతయ్య, బి.చంద్రరావు, ఆర్.విజయకుమార్, ఎన్.షణ్ముఖరావు పాల్గొన్నారు.

కాశీబుగ్గ: ఉద్దానం సాహితీ సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో కాశీబుగ్గలోని గాయత్రినగర్‌లో శ్రీశ్రీ సంస్మరణ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ కవి బమ్మిడి సుబ్బారావు మాట్లాడుతూ.. మరో ప్రపంచానికి, మహా ప్రపంచానికి వైతాళికుడు శ్రీశ్రీ అన్నారు. ఈయనకంటే ముందు గురజాడ అప్పారావు దేశమంటే మట్టి కాదోయ్ దేశమంటే మనుషులోయ్ అని అంటే.. శ్రీశ్రీ దేశమంటే శ్రామికులు, కార్మికులు, కర్షకులు అన్నారని గుర్తు చేశారు. వేదిక గౌరవాధ్యక్షులు వి.రాజారావు, జానపద కళాకారులు కుమార్ నాయక్ మాట్లాడుతూ.. శ్రీశ్రీని స్మరించుకోవడం అంటే ఆయన నుంచి ప్రేరణ పొందడమేనని అన్నారు. కవి తెప్పల కృష్ణమూర్తి అధ్యక్షత వహించిన సభలో వేదిక అధ్యక్షులు లండ రుద్రమూర్తి, సోమలయ్య, జి.సాంబమూర్తి, తెప్పల కృష్ణమూర్తి, ఎం.నాగేశ్వరరావు, బి.కాళిదాసు పాల్గొన్నారు.

డీపీఎల్ క్రికెట్ టోర్నమెంట్ విజేత సీతానగరం

టెక్కలి: రావివలస పంచాయతీ దామోదరపురంలో నిర్వహించిన డీపీఎల్ క్రికెట్ టోర్నమెంట్‌లో సంతబొమ్మాళి మండలం సీతానగరం జట్టు విజేతగా నిలిచింది. ఈ మేరకు ఆదివారం విజేతలకు బహుమతులు అందజేశారు. విన్నర్ జట్టుకు రూ.15 వేలతో పాటు షీల్డు, రన్నర్‌గా నిలిచిన అనిల్ లెవెన్ టీమ్‌కు రూ.10 వేలు, షీల్డు అందజేశారు. కార్తికేయ స్పోర్ట్స్ అకాడమి చైర్మన్ బగాది కిశోర్, ఏపీ చెస్ అసోసియేషన్ సెక్రటరీ సనపల భీమారావు, కె.వెంకటేశ్వరరావు, ఎస్.శశి, త్రివేణి, అజయ్, పవన్‌కళ్యాణ్, వెంకటరమణ, అభినాష్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులను గౌరవిద్దాం



వృద్ధులను గౌరవించడం అందరి బాధ్యతని టెక్కలి సీనియర్ సివిల్ జడ్జి బి.నిర్మళ సూచించారు. ప్రపంచ వృద్ధుల దుర్వినియోగ అవగాహన దినోత్సవం సందర్భంగా స్థానిక కోర్టు సముదాయంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ వృద్ధులను గౌరవించడంతోపాటు వారి హక్కులకు ఎటువంటి భంగం కలిగించకుండా చూడాలన్నారు. వృద్ధులకు ఎటువంటి సమస్యలు వచ్చినా స్థానిక కోర్టు పరిధిలో న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ఉచితంగా సేవలు పొందవచ్చునన్నారు. కార్యక్రమంలో చంద్రశేఖర్ పట్నాయక్, పి.మధుబాబు, బి.అయ్యబాబు, ప్రధాన హరిశ్చంద్ర, ధవళ కృష్ణారావు, సత్తారు రాంబాబు, ఎ.చిట్టిన్న పాల్గొన్నారు.

–టెక్కలి

ఉచిత వైద్య శిబిరం



ముందుస్తు జాగ్రత్తలతోనే గుండె సంబంధిత వ్యాధులు నివారించుకోవచ్చునని శ్రీకాకుళం మెడికవర్ వైద్యులు డాక్టర్ స్వాతి, డాక్టర్ రిషి అన్నారు. వజ్రపుకొత్తూరు మండలం తోటపల్లి గ్రామంలో మెడికవర్ ఆస్పత్రి, ఉద్దానం హెల్పింగ్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. గుండె వ్యాధులు గుర్తించిన పలువురు రోగులను ఆస్పత్రికి రిఫర్ చేసి ఉచిత మందులు, వైద్యసహాయం అందిస్తున్నట్లు వైద్యులు తెలిపారు. ఆహారపు అలవాట్లు, నిద్రలేమి సమస్యలు గుండె ఆరోగ్యాన్ని దెబ్బ తీస్తాయన్నారు. కార్యక్రమంలో ఉద్దానం హెల్పింగ్ ఫౌండర్ కె.విజయ్‌కుమార్, సంస్థ ప్రతినిధులు ఎస్.శాంతి, వంక జోగారావు, డి.క్రిష్ణారావు, డి.చంద్రశేఖర్, డిల్లేశ్వరరావు, పవన్‌చైతన్య, తిరుపతి ఉన్నారు.

–వజ్రపుకొత్తూరు

రూ. 51 వేల ఆర్థిక సాయం



సోంపేట పట్టణంలోని చిన్నకోమటి వీధికి చెందిన వేణుపాణిగ్రాహి ఇటీవల మృతి చెందాడు. నిరుపేద బ్రాహ్మణ కుటుంబం కావడంతో ఒడియా బ్రాహ్మణ అర్చక సంక్షేమ సంఘం ,సోంపేట తాలుకా సంఘ పెద్దలు అండగా నిలిచారు. రూ. 51 వేల సేకరించారు. ఈ మొత్తాన్ని వేణుపాణిగ్రాహి కుటుంబ సభ్యులకు ఆదివారం అందజేసి ఔదర్యాన్ని చాటుకున్నారు. సంఘ అధ్యక్షులు గాంధీజి పాణిగ్రాహి, కోశాధికారి షణ్ముఖ పాణిగ్రాహి, ప్రధాన కార్యదర్శి సింహాచలం పాడి, ఉపాధ్యక్షులు గోపాల్ ప్రసాద్ పాణిగ్రాహి, పలువురు సంఘ సభ్యులు పాల్గొన్నారు.

–సోంపేట

విమాన ప్రమాద మృతులకు కొవ్వొత్తులతో నివాళి


కొవ్వొత్తులతో ర్యాలీ చేస్తున్న జేసీఐ ప్రతినిధులు

ఇచ్ఛాపురం టౌన్: అహ్మదాబాద్‌లో ఇటీవల జరిగిన విమాన ప్రమాదంలో మృతి చెందిన వారి ఆత్మకు శాంతికలగాలని జేసీఐ ప్రతినిధులు ఆకాంక్షించారు. ఇందులో భాగంగా ఆదివారం రాత్రి ఇచ్ఛాపురం పట్టణంలో కొవ్వొత్తుల ర్యాలీ చేశారు. తొలుత బస్టాండ్ వద్ద మృతి చెందిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ కొవ్వొత్తులతో నివాళులర్పించారు. కార్యక్రమంలో జేసీఐ అధ్యక్షులు కె.జయదేవ్, వివిధ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ముగిసిన క్రికెట్ టోర్నీ


విన్నర్ జట్టుకు బహుమతి అందజేస్తున్న ఎమ్మెల్యే శిరీష

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ ఏడో వార్డు చినబడాంలో 20 రోజులుగా జరుగుతున్న క్రికెట్ టోర్నమెంట్ ఆదివారంతో ముగిసింది. 30 జట్లు పాల్గొనగా ఎస్ఎస్-11 కాశీబుగ్గ జట్టు విజేతగా నిలవగా.. వేణు పలాస జట్టు రన్నర్‌గా నిలిశాయి. విన్నర్ టీంకు రూ.70 వేలు, రన్నర్ జట్టుకు రూ. 40 వేలను పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష చేతులమీదుగా అందజేశారు. కార్యక్రమంలో ఏపీ ట్రేడ్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు, బీసీ సంఘ రాష్ట్ర నాయకుడు లొడగల కామేశ్వరరావు, నాయకులు బడ్డ నాగరాజు, గురిటి సూర్యనారాయణ, గాలి కృష్ణారావు, అవుగాన షణ్ముఖరావు, టంకాల రవిశంకర్‌గుప్తా, కొత్త సత్యం పాల్గొన్నారు.

అమ్మవారికి మాజీ మంత్రి పూజలు


ఆలయం ఆవరణలో మాజీమంత్రి అప్పలరాజు, నాయకులు

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ ఎనిమిదోవార్డు నర్సిపురం గ్రామంలో జరుగుతున్న పాతపట్నం గ్రామదేవత ఉత్సవాల్లో మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ఆదివారం పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. కౌన్సిలర్లు పిచ్చుకల అజయ్, కర్రి మాధవరావు, గుజ్జు జోగారావు, బెల్లాల శ్రీనివాసరావు, ఎంపీపీ డొక్కరి దానయ్య, ఎంపీటీసీ సభ్యుడు బమ్మిడ దుర్యోధనరావు ఉన్నారు.

నేడు పలాసలో జాబ్‌మేళా

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని శ్రీవిద్యావాహిణి డిగ్రీ కళాశాలలో సోమవారం క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్ (ఉద్యోగమేళా) నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పైల తిరుమలరావు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. అమేజాన్, విప్రో, టెక్‌మహేంద్ర, అరబిందో, అపోలో, హెటిరో, క్లోవ్, కాన్సెంట్రిక్స్, ప్రెమియర్ ఎనర్జీ ప్రతినిధులు పాల్గొంటారన్నారు. ఉత్తరాంధ్ర ప్రాంతంలో ఉండే కంపెనీలలో వందలాది ఖాళీలు ఉన్నాయని..వీటిలో భర్తీ కోసం పదో తరగతి, ఐటీఐ నుంచి ఎంఎస్సీ కెమిస్ట్రీ తదితర కోర్సులు పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులన్నారు. ఆసక్తి ఉన్నవారు పాల్గొనాలని సూచించారు. మరిన్ని వివరాలకు 98492 35661 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

నేడు 'వెన్నుపోటు' పుస్తకావిష్కరణ

టెక్కలి: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అన్ని వర్గాలకు చేసిన మోసాలపై రూపకల్పన చేసిన వెన్నుపోటు పుస్తకాన్ని సోమవారం టెక్కలిలో ఆవిష్కరిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఉదయం పది గంటలకు టెక్కలి వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నిర్వహిస్తున్న పుస్తకావిష్కరణ కార్యక్రమానికి నియోజకవర్గం వ్యాప్తంగా ఉన్న పార్టీ నాయకులు, కార్యకర్తలు, అనుబంధ విభాగాల ప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

మందస: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆ పార్టీ నాయకులు అన్నారు. స్థానిక బీజేపీ కార్యకర్తలతో ఆదివారం నిర్వహించిన సమావేశంలో పలువురు నాయకులు మాట్లాడారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ రోజుకు 18 గంటలు దేశం సంక్షేమం కోసం పని చేస్తున్నారన్నారు. ఆపరేషన్ సిందూర్ పేరుతో ఉగ్రవాదులను గడగడలాడించిన ఘనత ప్రధానమంత్రికి దక్కిందన్నారు. బడుగు, బలహీనవర్గాల సంక్షేమం కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నట్టు చెప్పారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అట్టాడా రవిబాబ్జీ, పూర్వపు జిల్లా అధ్యక్షులు బిర్లంగి ఉమామహేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి పాలవలస వైకుంఠరావు, నాయకులు బూరె నరేంద్ర, రౌతు చిరంజీవి, తెలుకుల సురేష్, రట్టీ లక్ష్మణ కూమార్, వై.కృష్ణమోహన్, ఇప్పిలి వెంకటరావు, పున్నయ్య పాల్గొన్నారు.